క్లుప్తంగా

వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు



తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వార్షిక మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. సేవాసమితి సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి బుధవారం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు జరిపారు. వైకుంఠపురం దేవస్థానం మాజీ చైర్మన్ పుప్పల వరదరాజులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, పంచముఖ ఆంజేయ సేవా సమితి అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వన్‌టౌన్ పీఎస్ పరిశీలన



తెనాలిరూరల్: తెనాలి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ బి.జనార్ధనరావు బుధవారం పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడి విధి నిర్వహణలో పాటించాల్సిన అంశాను వివరించారు. వన్‌టౌన్ సీఐ కె.చంద్రశేఖర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



తెనాలి: ది తెనాలి పీఅండ్‌టీ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా బీఎస్ఎన్ఎల్ జేఈ బైరబోయిన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తపాలశాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో శ్రీనివాసరావు ఎన్నికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖాగ్రంథాలయంలో నడుస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రేడ్–1 గ్రంథాలయాధికారి కె.రమాదేవి కోరారు. ప్రస్తుతం గ్రంథాలయంలో 6–10 తరగతుల విద్యార్థులకు నీతికథలు, నీతిపద్యాలు, ప్రముఖుల జీవితచరిత్రలు బోధించటంతోపాటు డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతివిద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. స్థానిక పాఠశాలకు చెందిన హుస్సేన్ మాస్టారు బుధవారం నీతిపద్యాలు, భావాలు నేర్పించారు. పలు ఇండోర్ గేమ్స్ నేర్పించారు. విద్యార్థులకు కథలు చెప్పి, మళ్లీ తిరిగి వారిచేత చెప్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి విజ్ఞాన శిబిరంలో చేర్పించాలని కోరారు.

కళాకారుడు బాబురావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం దేవుడు చేసిన మనుషులు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం శ్రీకృష్ణతులాభారము చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాకారుడు, డోలక్, తబల విద్వాంసులు కోడూరు బాబురావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, పినపాటి రవీంద్ర, వేములమడ వెంకటేశ్వరరావు, తాడిబోయిన సురేష్, ఫణిదపు దుర్గా, కోడూరు సత్యనారాయణ, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పరస్పర దాడి కేసులో నిందితులకు జరిమానా

తెనాలిరూరల్: పరస్పర దాడి కేసులో నిందితులకు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో 2017లో ఇరువర్గాలు ఓ స్థలం విషయమై ఘర్షణ పడి పరస్పర దాడికి పాల్పడ్డారు. చుండూరు పోలీసులు మొత్తం 11 మందిపై పరస్పర కేసులు నమోదు చేశారు. కేసులు బుధవారం విచారణకు రాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత, నిందితులకు రూ. 300 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు కేసుల్లో తెనాలి సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్, రేపల్లె ఏపీపీ గాదె వెంకటేశ్వర్లు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

చెంచు కాలనీ అభివృద్ధికి నిధులు

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్
- తాడికొండలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: తాడికొండ పరిధిలోని చెంచుల కాలనీని రూ.30 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. స్థానిక చెంచుల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వర్షాకాలంలో నానా ఇబ్బందులు పడుతున్నామని పట్టించుకోవడం లేదని చెప్పారు. స్పందించిన కత్తెర మండల పరిషత్, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించిన జగనన్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. దమ్మున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని, ఆయన పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికి సంక్షేమం అందుతుండటంతో ప్రతి గడపలో చిరునవ్వు కనిపిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, తాడికొండ, నిడుముక్కల, కంతేరు సర్పంచులు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్ బాబు, ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి, తాళ్ల శివనాగరాజు, ఎంపీడీఓ బిక్కి మహేష్ బాబు పాల్గొన్నారు.

చలో గుంటూరును జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ

తాడేపల్లిరూరల్: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చలో గుంటూరు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ కోరారు. దుగ్గిరాలలో కార్మికుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుపైగా అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు గత ఏడాది వరకు కేంద్ర ప్రభుత్వం జీతాలు చెల్లించిందని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను వదిలివేయడంతో గ్రీన్ అంబాసిడర్ల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. అసలే అంతంత మాత్రం ఆదాయాలతో నెట్టుకొస్తున్న అత్యధికక గ్రామ పంచాయతీలు గ్రీన్ అంబాసిడర్ల జీతాలు భరించగలిగిన పరిస్థితుల్లో లేవని, తక్షణమే ప్రభుత్వం స్పందించి వారి జీతాల చెల్లింపు నిర్ణయం చేయకపోతే అత్యధిక గ్రామ పంచాయతీలలో వారిని తొలగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పెరవలి శ్రీరాములు, సీఐటీయూ నాయకులు బాలరాజు, యూనియన్ మండల నాయకులు బి.నరసింహారావు, పి. కోటేశ్వరరావు, కె.దీనకుమారి, కె.రత్నజ్యోతి పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలని వినతి

తాడేపల్లిరూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీలకు బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం విన్నవించారు. దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు వారాల వేతన బకాయిలు ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి. శ్రీరాములు, ఎం.సాంబశివరావు, అమ్మిరెడ్డి, వి.సాంబశివరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయపురి కాలనీకి చెందిన ఏజండ్ల మారుతీ ఇటీవల స్థలాన్ని కొనుగోలు చేశాడు. మధ్యవర్తిగా ఉన్న అలి, సుబ్బారావు కమిషన్ విషయంలో గొడవ పడ్డారు. బుధవారం ఇద్దరు అతడి ఇంటికి వెళ్లి దాడి చేశారు. మారుతి భార్య అడ్డు వస్తే ఆమెను దుర్భాషలాడారు. దంపతుల్ని చంపుతామని బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామపై అల్లుడు దాడి

కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడు మామపై దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్‌లో నివసించే హనుమంతరావును అదే ఇంట్లో ఉంటున్న అల్లుడు నగేష్ కుటుంబ కలహాల నేపథ్యంలో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మద్యానికి బానిసై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 12వ లైనులో నివసించే సాయిబాబు (56) మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈనెల 9న మద్యం మత్తులో కిందపడడంతో గాయపడ్డాడు. భార్య భూలక్ష్మి చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించింది. చికిత్స పొందుతూ బుధవారం సాయిబాబు మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉండవల్లి చిన్నడొంక రోడ్డు పరిశీలన



ఉండవల్లి చిన్నడొంకను పరిశీలిస్తున్న కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో మరో రెండు బీటీ రోడ్లు నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. బుధవారం డి.ఇ. కృష్ణారెడ్డి ఆ ప్రాంతాలను పరిశీలించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉండవల్లి చిన్నడొంకలో బీటీ రోడ్ నిర్మించాలని రైతులు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)కి ఆ ప్రాంతంలోని రైతులు వినతిపత్రం ఇవ్వడంతో రోడ్డు నిర్మించేందుకు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభించనున్నటు పేర్కొన్నారు. ఉండవల్లి సెంటర్ నుంచి ఊరిలోకి వచ్చే దారిలో గుంటూరు చానల్ దాటిన తరువాత కోలా సుబ్బారావు రోడ్‌లో మరో రూ.కోటి 20 లక్షలతో 700 మీటర్ల పొడవు, 5 మీటర్ల పొడవుతో బీటీ రోడ్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈలు కిశోర్, ప్రవీణ్, మంగళగిరి శివాలయం బోర్డు మెంబర్ కొల్లి ముసలారెడ్డి ఉన్నారు.

'స్వచ్ఛ గుంటూరు'లో భాగస్వాములు కావాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో భానుప్రకాష్

నెహ్రూనగర్: 'స్వచ్ఛ గుంటూరు'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజారోగ్య అధికారి (ఎంహెచ్‌వో) డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు. ఆయన బుధవారం ఎస్ఎస్ సోమ శేఖర్, అధికారులు, కార్యదర్శులతో కలసి బృందావన్ గార్డెన్స్, రాజేంద్రనగర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ, తడి పొడి విభజన తదితర అంశాల్ని పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌వో మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రధానంగా ఎక్కడా చెత్త పాయింట్లు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. నగర ప్రజలు కూడా వ్యర్థాల్ని తడిపొడిగా విభజన చేసి ప్రజారోగ్య కార్మికులకు అందించాలని ఆయన సూచించారు. రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలు వేయడం వల్ల పరిసరాల అపరిశుభ్రంతో పాటు ప్రజారోగ్యం కూడా ప్రమాదంలో పడుతుందని తెలిపారు. ప్రతి వ్యాపార వాణిజ్య సంస్థ తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎగిరే ధిక్కార పతాకం కలేకూరి ప్రసాద్



నెహ్రూనగర్: దళిత ధిక్కార కవిగా, ప్రజా పాటల రచయితగా, దళిత విప్లవ ఉద్యమకారుడిగా, సంపాదకుడిగా నిడంబర జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి కలేకూరి ప్రసాద్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ కొనియాడారు. అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో బుధవారం కలేకూరి ప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ కలేకూరి ప్రసాద్‌కు అతి చిన్న వయస్సులోనే విప్లవ ఉద్యమాలకు ఆకర్షితుడై ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. దళితులు, స్త్రీలు, బీసీలు, మైనార్టీల హక్కుల సాధన కోసం చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప ఆదర్శవాది అని కొనియాడారు.

21న గుంటూరులో హైందవ ధర్మ శంఖారావం

నగరంపాలెం: నగరంలో ఈనెల 21న హైందవ ధర్మ శంఖారావం నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ దీక్షా సేవక్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇక్కుర్తి సదాశివరావు తెలిపారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో బుధవారం శంఖారావం గోడ ప్రతుల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని శ్రీ వాసవీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ సమీపంలోని ఛత్రపతి శివాజీ ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు శంఖారావం ప్రారంభమవుతుందని తెలిపారు. శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీ శివస్వామి, పీఠాధిపతులు, స్వామీజీలు, రాష్ట్రస్థాయి ధార్మిక సంస్థల ప్రతినిధులు, పదివేల మంది భక్తులు హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాను కేంద్రంగా చేసుకుని ధర్మ ప్రచారక్ ద్వారా వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. భాజపా రాష్ట్ర పదాధికారి కొక్కెర శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ శంఖారావం పేరుతో చేపట్టిన సమ్మేళనానికి ప్రతి హిందువూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్షుడు వై.రాజేష్, నగర ప్రచారక్ ఊరబండి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్, కోశాధికారి మలిశెట్టి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మంచి మెజీషియన్లుగా తయారు కావాలి




మ్యాజిక్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- ప్రముఖ మెజీషియన్ క్రాంతికార్
- ముగిసిన మ్యాజిక్ శిక్షణ తరగతులు

తాడేపల్లిరూరల్: బాలలు భవిష్యత్‌లో మంచి మెజీషియన్లుగా తయారు కావాలని ప్రముఖ మెజీషియన్ క్రాంతికార్ అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన మ్యాజిక్ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ సుమారు 10 రకాల మ్యాజిక్ ట్రిక్కులు పిల్లలు నేర్చుకున్నారని వివరించారు. 13 రోజుల నుంచి అత్యంత క్రమశిక్షణతో మ్యాజిక్‌లో శిక్షణ పొందిన పిల్లలను అభినందించారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ విజయవాడ రాఘవయ్య పార్క్ వద్ద ఉన్న ఎంబీ విజ్ఞాన కేంద్రంలో 13 రోజుల పాటు నేర్చుకున్న వివిధ రకాల మ్యాజిక్‌ను బాల మెజీషియన్లు అందరి సమక్షంలో ప్రదర్శిస్తారని అన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



గుర్తు తెలియని యువకుని మృతదేహం

మంగళగిరి: నగరంలోని ఆటోనగర్ వద్ద ప్రధాన రహదారిపై ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 28–30 ఏళ్ల కలిగిన గుర్తు తెలియని యువకుడు నగరంలోని ఆటోనగర్ సమీపంలోని ప్రధాన రహదారి వద్ద మద్యం మత్తులో పడి ఉన్నట్లు స్థానికులు బుధవారం సాయంత్రం సమాచారం అందించినట్లు తెలిపారు. ఘటనా ప్రాంతానికి చేరుకోగా అప్పటికే గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా మృతుడు ముక్కుపొడి కలరులో ఉన్న గళ్ల ప్యాంటు, తెలుపు, నలుపు, పాచి కలరు కలిగిన టీషర్టు ధరించి ఉన్నాడని, యువకుని ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఏపీ ఎస్ఆర్ఎంకు ఎస్ఈఆర్‌బీ రీసెర్చ్ ప్రాజెక్టులు

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ పరిశోధనా రంగంలో ప్రతిష్టాత్మక మైలురాయిని చేరింది. యూనివర్సిటీకి చెందిన 10 మంది సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్లకు కేంద్ర ప్రభుత్వం రూ.2.50 కోట్ల రీసెర్చ్ గ్రాంట్ మంజూరు చేసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్ (ఎస్ఈఆర్‌బీ) దేశ వ్యాప్తంగా ఉన్న స్టేట్ యూనివర్సిటీలకు ఎస్‌యూఆర్ఐ పథకం కింద ఈ గ్రాంట్లను మంజూరు చేసింది. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాల్లో సృజనాత్మక పరిశోధనలు జరిపే ప్రొఫెసర్లను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ ఏడాది గ్రాంట్లు మంజూరు కోసం దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల నుంచి సుమారు 2వేల ప్రతిపాదనలు డీఎస్టీకి అందగా అందులోని 466 ప్రాజెక్టులకు గ్రాంట్లు మంజూరయ్యాయి. వీటిలో 151 ప్రాజెక్టులు ప్రైవేటు యూనివర్సిటీలకు చెందినవి కాగా అందులో 10 ప్రాజెక్టులకు రూ.2.50 కోట్ల విలువైన గ్రాంట్లు పొందిన ఘనత ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీకి లభించింది. మూడేళ్ల కాలపరిమితిలో పరిశోధనలు పూర్తి చేయాలని ఎస్ఈఆర్ మంజూరు ఉత్తర్వుల్లో పేర్కొంది.

రీసెర్చ్ గ్రాంట్స్ పొందిన ప్రొఫెసర్లు వీరే...

యూనివర్సిటీకి చెందిన 10 మంది ప్రొఫెసర్లు రూ.2.50 కోట్ల ఎస్ఈఆర్‌టీ గ్రాంట్లు పొందారు. వీరిలో డాక్టర్ దేబబ్రత ప్రామాణిక్, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ పంకజ్ భల్లా (ఫిజిక్స్), డాక్టర్ సందీప్ సింగ్, డాక్టర్ పిచ్చియ్య, డాక్టర్ జయశీలన్, (బయాలజీ), డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి, డాక్టర్ బస్వంత్ (కెమిస్ట్రీ), డాక్టర్ ఉమమహేశ్వర్ (సివిల్), డాక్టర్ కౌషిక్ దాస్(ఎన్విరాన్మెంట్ సైన్స్), సందీప్ కుమార్ శర్మ(మ్యాథ్స్) ఉన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ హెలెన్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ వర్చ్యువల్ సదస్సు బుధవారం ముగిసింది. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఆవిష్కరణలు, సవాళ్లపై రెండు రోజుల అంతర్జాతీయ వర్చ్యువల్ సదస్సు విజయవంతంగా నిర్వహించామన్నారు. కో కన్వీనర్లు డాక్టర్ ఎస్.ఎన్.పాడీ, డాక్టర్ ఎస్.ఎస్. రావు, డాక్టర్ జి.మురళి నేతృత్వంలోని ఆర్గనైజింగ్ కమిటీ సదస్సును విజయవంతం చేయడంలో కృషి చేశారని అన్నారు. సదస్సులో డాక్టర్ టి.వై. చివు, డాక్టర్ మామిళ్ల రవిశంకర్, డాక్టర్ హెలెన్, బాసిల్, డాక్టర్ ఎస్.శక్తినాథన్, డాక్టర్ ప్రదీప్ దీక్షిత్, డాక్టర్ వి.పాండురంగ శక్తి మరియు పదార్థాలు, మైక్రోమిషన్స్, అటానమస్ వెహికల్ నావిగేషన్, శక్తి మరియు పర్యావరణ పరిరక్షణలో గ్రాఫేన్ మిశ్రమాల వంటి పలు ఆసక్తికరమైన అంశాలపై తమ ప్రదర్శనలు ఇచ్చారని వివరించారు. మెకానికల్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన వివిధ అంశాలపై 46 మంది పాల్గొని ప్రదర్శనలను ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సీసీఓ డాక్టర్ ఎ.జగదీష్, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలు

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు



వైద్య పరికరాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు, అనిల్ చక్రవర్తి

మంగళగిరి: డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందించడం ఎంతైనా అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు కొనియాడారు. మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు గణపతి నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.30వేల విలువైన పరికరాలను, కుర్చీలను బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని నివాస గృహాల మధ్య ప్రభుత్వం అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూపీహెచ్‌సీలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ మెయింటెన్స్‌లో భాగంగా స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ వైద్య పరికరాలను అందించడం ఎంతైనా అభినందనీయమన్నారు. మంగళగిరి రెడ్‌క్రాస్ చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సుమారు రూ.30వేల విలువైన వైద్య పరికరాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి అనూష, సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు, స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అనిల్ చక్రవర్తిలకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ ఎస్ఏ శిలార్, ఈసీ మెంబర్ గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంటలకు విలువ జోడింపుతోనే రైతుకు ఆదాయం


ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి



సేంద్రియ ఎరువుల తయారీ విధానాలను తెలుసుకుంటున్న శ్రీనాథ్‌రెడ్డి

గుంటూరు రూరల్ (వట్టిచెరుకూరు): రైతులు పండించిన పంటల్ని నేరుగా విక్రయించకుండా వాటికి విలువలు జోడించి అమ్ముకోవడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చని ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌ను ఆయన బృందంతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఏక పంటలు కాకుండా మిశ్రమ పంటల్ని సాగు చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టినట్లయితే అధిక ఆదాయంతో పాటు భూమికి కావలసిన సేంద్రియ పదార్థాన్ని పొందవచ్చని సూచించారు. రసాయనాలు వాడకుండా సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువుల్ని ఉపయోగించినట్లయితే భూమి ఆరోగ్యంతో పాటు ప్రజలకు మంచి ఉత్పత్తుల్ని అందించవచ్చని చెప్పారు. రైతులకు చిన్నచిన్న ఫుడ్ ప్రాసెసింగ్ యంత్ర పరికరాలకు రుణాల్ని ఆప్కాబ్ ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సేంద్రియ సాగుకు సంబంధించిన వివిధ కషాయాలు, ద్రావణాలు, సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటల్ని ప్రత్యక్షంగా తిలకించారు. చిరుధాన్యాల ప్రాసెసింగ్ యంత్రాలు, వంటకాలు తయారుచేసే విధానాల్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులకు, నిరుద్యోగులకు రైతునేస్తం ఫౌండేషన్ అందించే సేవల్ని అభినందించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ అధికారులు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన గుళికలతో పలు ఉపయోగాలు



విత్తన గుళికలు తయారు చేసే విధానం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వరప్రసాద్

పెదనందిపాడు: ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తన గుళికలు తయారు చేసుకోవడం వల్ల పలు ఉపయోగాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం మండల రిసోర్స్ పర్సన్ చింతా వరప్రసాద్ తెలిపారు. విత్తన గుళికలు తయారు చేసే విధానం గురించి బుధవారం సాయంత్రం మండల పరిధిలోని రావిపాడు, గోరిజవోలుగుంటపాలెం గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించారు. వరప్రసాద్ మాట్లాడుతూ విత్తన గుళికలు పురుగులు పట్టకుండా, చీమలు, పక్షులు తినకుండా భూమిలో ఉండి వర్షం పడిన వెంటనే మొలకలు ఎత్తుతాయని తెలిపారు. మొలకెత్తిన తర్వాత 45 రోజులకు భూమిలో కలియదున్నడం వల్ల భూమికి మంచి పోషకాలు లభిస్తాయని, తద్వారా దిగుబడులు ఎక్కువగా సాధించవచ్చని సూచించారు. విత్తన గుళికలు రైతుభరోసా కేంద్రాల్లో ఉన్నాయని చెప్పారు.